
# బాబ్ వాంగ్ సీర్

జంధ్యాల సుబ్బలక్ష్మి



'ఏ క్షణాన వస్తుందో', వచ్చి ఏం చేస్తుందో, అసలు వస్తుందో రాదో, అమ్మో! రాకుండా ఉండదు. వస్తుందని చెప్పింది సామాన్యుడు కాదు. ఒక మహా విజ్ఞాని. అతడి మాట వేదవాక్కు. అయినా నిజంగానే వస్తుందా, వస్తే ఏం చెయ్యాలి? అయినా నాకెందుకు భయం. ఇంత మంది ఉన్నారు. వాళ్లందరిలో ప్రత్యేకించి నన్ను ఎన్నుకుని ఏమీ చెయ్యలేదు. అయినా కానీ చూద్దాం.




అక్కడ ఉన్న ప్రేక్షకుల్లో కొందరి మనస్సులో అదే ఆలోచన. అయినా ఒక ఉత్కంఠ. ఏం జరుగుతుందోనని, కొందరు లోపల భయ పడుతున్నా పైకి ధైర్యంగా ఉన్నారు. కొందరు నిజంగానే ధైర్యంగా ఉన్నారు. వాళ్లలో నేనొకడిని.

స్టేజి మీద ఒక మనిషి ఉన్నాడు. మనిషి అంటే మామూలు మనిషి కాదు మహానుభావుడు, మహాత్ముడు కూడా కావచ్చు. భుజాల వరకూ పెరిగిన జుట్టూ, పిల్లి గడ్డం, పొడుగు చేతుల నల్లటి పొడవాటి గౌను. అసలే ఎత్తైన విగ్రహం. అందులో నల్లని దుస్తుల్లో, కొంత భయంగొలిపేలా, కొంత భక్తి కలిగేలా ఉన్నాడు.

అతడు ఆత్మలను పిలుస్తాడు. అవి పాపం ఎవరు పిలుస్తారా అని ఎదురు చూస్తుంటాయేమో, అతడు పిలవగానే పరుగెత్తుకుంటూ (గాలిలో) వచ్చేస్తాయి. వచ్చి అతడి శిష్యులను ఆవహిస్తాయి.

"అతడు ఏ ఆత్మను పిలిస్తే ఆ ఆత్మ వస్తుంది. ఇండియన్, ఫారిన్ అన్న భేదం లేదు. ఆడ, మగ అన్న తేడా లేదు. కృతయుగం నుంచీ ఐదు సంవత్సరాల క్రితం వరకూ చనిపోయిన వారందరి ఆత్మలూ అతని ఆధీనంలో ఉన్నాయి" అని బయట బోర్డు మీద చదివాను.

ప్రదర్శన ప్రారంభానికి ముందు కొంత సన్నాహం, కొంత ఆర్భాటం, కొంత తతంగం నడుస్తున్నాయి. అతడు స్టేజి మీద మాయల ఫకీరులా అటూ ఇటూ తిరుగుతూ ఉంటే సదాజపలాంటి శిష్యులు నలుగురైదుగురు అతడి మాటలను శ్రద్ధగా ఆలకించి అతడు చెప్పినట్లు చేస్తున్నారు.

స్టేజి మీద ఒక పక్కగా వేసిన కుర్చీలో ఒక యువకుడు వచ్చి కూర్చున్నాడు. తెల్లటి దుస్తుల్లో సాదాగా ఉన్నాడు. అతడి ముందున్న బల్ల, దాని మీద కొన్ని కాగితాలు. అతడి చేతిలో పెన్ను. ఏ భావమూ లేకుండా బిర్ర బిగుసుకు పోయి కూర్చుని ఉన్నాడు. ఆత్మ ఆవహించబోయే వ్యక్తి ఇతడు కాబోలు! బలిపీఠం ముందుకు తెచ్చిన మేక పిల్లలా కనిపిస్తున్నాడు.

'మాస్టారూ! నిజంగానే ఆత్మ వస్తుందంటారా' అన్నాడు నా పక్కన కూర్చున్నాయన. భయ పడుతున్నాడు కాబోలు నా చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"చూస్తారుగా" అన్నాను.

అతడు ఈ ప్రదర్శనకు రావడం ఇదే మొదటిసారి కాబోలు. ఒకసారి జరిగిన చోట మరొకసారి జరగవవి. నేను ఇది వరకే ఇతడి ప్రదర్శనలు చాలా చూశాను.

స్టేజి మీద ఏర్పాట్లు పూర్తయినట్లున్నాయి. మాయల ఫకీరు (అతడికి పేరు వేరే ఉంది. బయట బోర్డు మీద తాటికాయలంత అక్షరాల్తో రాసి ఉంది. నాకు మాత్రం అతణ్ని చూస్తే అతడి అసలు పేరు కన్నా ఫకీరన్న మాటే గుర్తుకు వస్తుంది).

"ఇప్పుడు మీరు, మీరు కోరుకున్న ఆత్మ పేరు మీ దగ్గరున్న చీటీ మీద రాసి మా శిష్యుల చేతికి ఇవ్వండి. ఆ ఆత్మ ఈ యువకుడిని ఆవహించి మీ ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంది. ఆత్మను ఆశ్రయించి మీ జీవిత గమనాన్ని మార్చుకోండి" అని 'ఆత్మాశ్రయ కవిత్వం' చెప్పాడు మాయల ఫకీరు.

హాల్లోకి వచ్చే ముందే ప్రేక్షకులందరికీ ఒక్కో చీటీని ఇచ్చారు. ఆ చీటీలన్నీ ఒకే సైజులో లేత నీలం రంగులో ఉన్నాయి. దాని మీద మాయల ఫకీరు పేరు అచ్చులో ఉంది. కింద ప్రేక్షకులు రాయడానికి వీలుగా మీ పేరు, మీరు కోరిన ఆత్మ పేరు అని రాసి ఉంది. శిష్యులు వచ్చి చీటీలు తీసుకుంటున్నారు. నీకు నా చీటీ ఇవ్వకుండా అదే రంగు కాగితం ఒకటి మడిచి ఇచ్చాను.

శిష్యులు తాము తెచ్చిన చీటీలన్నింటినీ స్టేజి మీద పెద్ద పాత్రలో వేసి కలయ దిప్పారు.

'పది ఆత్మలు మాత్రమే వస్తాయి. లాటరీ పద్ధతిలో ఆ పది ఆత్మల పేర్లను ఎన్నుకుంటాం' అన్నాడు మాయల ఫకీరు. ప్రేక్షకులలోంచి ఒకడిని పిలిచి ఓ చీటి తియ్యమన్నాడు.

"వాల్మీకి" చీటీ తీసి చదివాడతడు. మరొకర్ని పిలిచాడు ఫకీరు ప్రేక్షకులలోంచి. ఆ రెండవ వాడికి మొదటివాడు వేసిన చీటి ఇచ్చి చదవ మన్నాడు.

"వాల్మీకి" రెండోవాడు చదివాడు. ఇద్దర్నీ కిందికి వెళ్లమని చెప్పి, గాలిలో చేతులు తిప్పాడు. మంత్రదండం తిప్పాడు. తర్వాత కోర్టులో పిలిచినట్లు

"వాల్మీకి, వాల్మీకీ, వాల్మీకీ" అని పిలిచాడు. అంత వరకూ బిగుసుకుపోయి ఉన్న మేకపిల్ల కదిలాడు. పెన్ను అప్రయత్నంగా పేపరు మీద పెట్టాడు.

"వాల్మీకి వచ్చాడు. మీ ప్రశ్న అడగండి" అన్నాడు మాయల ఫకీరు. ఫకీరు మాటలు పూర్తి అయ్యీ కాకముందు "రామాయణం మీరెప్పుడు రాశారు?" అని అడిగాడు ఒకతను వాల్మీకిని.

మేకపిల్ల కాగితం మీద ఏదో రాశాడు. సదా జప చదివాడు.

"రాముడు పుట్టక ముందే."

ప్రేక్షకులంతా చప్పట్లు కొట్టారు.

మళ్లీ ఇద్దరు ప్రేక్షకులను పిలిచి ఇది వరకు లాగే చదవమన్నారు.

"ధృవుడు."

"ధృవుడూ, ధృవుడూ, ధృవుడూ"

'ఆ ధృవుడు వచ్చాడు. మీ ప్రశ్న అడగండి.'

'మీరు తపస్సు కెళ్లే నాటికి మీ వయసెంత'

"పదేళ్ళలోపే" మేక పిల్ల రాయగా సదా జప చదివాడు. మళ్ళీ ప్రేక్షకుల్లోంచి చప్పట్లు.

"ఈసారి స్త్రీ లెవరైనా వచ్చి తియ్యండి" మాయల ఫకీరు చెప్పాడు. ఇద్దరు స్త్రీలు స్టేజి మీదికి వెళ్ళారు.

"సీత"

"సీతా, సీతా, సీతా"

"లవకుశులు మీరు ఆశ్రమానికి వెళ్లేక ముందు పుట్టారా, తర్వాతనా"

'మహర్షి ఆశ్రమంలోనే లవకుశులు పుట్టారు'

ప్రేక్షకులు చప్పట్లు కొట్టడానికే వచ్చినట్లు చప్పట్లు కొట్టారు.

'చూశారా ఎంత శక్తి సంపన్నుడో ఆయన. వాల్మీకి, ధృవుడు, సీతాదేవిని కూడా రప్పించాడు' నిజంగా వాళ్లను చూచి తరించి పోయినట్లే పరవశిస్తూ అన్నాడు నా పక్క సీట్లో ఆయన.

"మాస్టారూ ఒకసారి బయటికి వస్తారా" అన్నాను.

"ఎందుకు?" భయంగా అడిగాడతను.

"ఒక చిన్న తమాషా చేద్దాం."

"తమాషానా" కంగారుగా జేబులు తడిమి చూచుకున్నాడు.

"భయం లేదు."

ఇద్దరం లేచి బయటికెళ్లాం. ముందు సీట్లలో ఉన్నవాళ్లు మరో ముగ్గురు వచ్చి మాతో కలిశారు. వాళ్లు ముగ్గురూ నాకు తెలిసిన వాళ్లే.

ఏదైనా ప్రదర్శన జరిగేప్పుడు హాల్లో లైట్లు ఆర్పేస్తారు. బోరు కొడితే మధ్యలో చెక్కేసేందుకు వీలుగా అలా చెక్కేసే వాళ్లను ఇతరులు గమనించే అవకాశం లేదు. స్టేజి మీది నుంచి ఫకీరుగానీ, సదా జపగానీ, మేకపిల్లగానీ మమ్మల్ని చూసి ఉండరు.

"నాటకం అర్థమవుతోందా" అన్నాను ముందుగా నేను.

"నాటకమా, ఇది....." నా పక్క సీటతను అమాయికంగా అన్నాడు.

"అదేదో ఆత్మలు..."

"మీరుండండి మాస్టారూ! మీకు అర్థం కావడానికి ఇంకాస్త టైం పడుతుంది" అన్నాను. ట్యూబ్ లైటు వంటి అతణ్ని చూస్తూ.

"అవును కొంచెం కొంచెం" అన్నాడు హరి.

"వాల్మీకి, ధృవుడు, సీత ఆత్మలు రావడమేమిటి, అబ్సర్డ్" అన్నాడు శివ. కరెక్ట్ అన్నట్లు వేలు పైకెత్తాను.

"అవున్రా. వాల్మీకి ఎప్పుడో మోక్షం పొందాడు. ఆయన ఇంకా ఆత్మగా ఉండే అవకాశం లేదు. ధృవుడు తారగా మారాడు. ఇక సీత మనకు తెలిసింది. ఆమె శ్రీ మహాలక్ష్మి అవతారమేనని. దేవుళ్ల ఆత్మలవుతారా, వీడు పిలిస్తే వస్తారా పైగా ఎప్పుడో మరణించిన వారిని సైతం పిలుస్తానంటాడు. పునర్జన్మలుండవా? వాళ్లు చనిపోయినప్పట్నుంచీ ఇప్పటి దాకా ఆత్మలుగానే ఉంటారు. ఒకవేళ ఉన్నా, అలా ఉండే వారి సంఖ్య చాలా స్వల్పం."

"అవున్నిజమే. చూశార్రా వెర్రిజనం ఎలా చప్పట్లు కొడుతున్నారో. వాడికీ పూట కలెక్షన్ ఆరువేలకు పైగానే ఉంటుంది. ఇంకోటి ప్రదర్శనకు టిక్కెట్లు కూడా" అన్నాడు హరి.

"అదా సంగతి" అన్నాడు ట్యూబ్‌లైట్. అందరం కలిసి వేం చెయ్యవలసిందేమిటో నిర్ణయించుకున్నాం. ట్యూబ్‌లైటును మాలో చేర్చుకోలేదు. అతడు మౌన ప్రేక్షకుడు మాత్రమే. అతడికున్న తెలివికి, ధైర్యానికీ అతడుగానీ నోరు విప్పితే వేం చెయ్యదలచు కున్న పని వెనక్కుపోతుంది.

"అవును. మరి ప్రశ్నలు ఏడే కదా ఇవాళ అడగబడేది. అయిపోయాయేమో" అన్నాడు ట్యూబ్‌లైటు.

"లేదు. మొదట ఐదు ప్రశ్నలు. తర్వాత పావుగంట విరామం ఉంటుంది. తర్వాత వాళ్ల వేషాలు మార్చుకుని వస్తారు. ఈసారి మాయల ఫకీరు రాజు వేషంలో ఉంటాడు. శిష్యులంతా రాజభటుల్లా ఉంటారు. మేకపిల్లకు ముని కుమారుడి గెటప్ వేస్తారు" అన్నాను.

'అంటే ప్రేక్షకులను వెనక్కి నడిపిస్తున్నట్లు' అన్నాడు హరి.

"అందుకే మరి" అన్నాడు శివ. అందరం లోపలికి వెళ్లాం.

మొదటి ఐదు ప్రశ్నలూ వాళ్ల ఆంతరంగికులే వేస్తారు. అలా ప్రేక్షకులను మభ్యపెట్టిన తర్వాత రెండో ఐదు ప్రశ్నలూ ప్రేక్షకులు అడగవచ్చు.

అయితే ఆ పాత్రలో ఉండే చీటీలు మాత్రం ప్రేక్షకులు రాసినవి కావు.

ప్రేక్షకులు రాసిన చీటీలన్నీ శిష్యులు తీసుకుని కుడి జేబులో దాస్తారు. పెద్ద పాత్రలో మాత్రం అది వరకే రాసి ఎడమ జేబులో ఉంచుకున్న చీటీలు వేస్తారు. అంటే ఎవరు చీటీ వేసినా పేరు మాత్రం మాయల ఫకీరు బృందం ముందుగా రాసి పెట్టుకున్నవే వస్తాయి. ఆ పేర్లను బట్టి ప్రశ్నలుంటాయి కాబట్టి ఎవరు అడిగినా జవాబు మాత్రం సులభంగా ఉండి తీరుతుంది.

ఈసారి ఒక్కో పేరు ఇద్దరు చదవక్కర్లేదు. ఒక ప్రేక్షకుడు వెళ్లి చీటి తీసి చదివితే చాలు. ఆరో ప్రశ్నకు హరి వెళ్లాడు. ముందుగా వేం అనుకున్నట్లుగానే హరి పాత్రలోంచి చీటీ తీసి ఎడమ జేబులో వేసుకుని, కుడి జేబులోంచి మరో చీటీ తీసి చదివాడు. ఎవరూ గమనించకుండా ఇది ఎలా చెయ్యాలో వేం ముందుగా ప్రాక్టీసు చేసుకున్నాం.

"జేమ్స్‌వాట్"

"వాట్ (what) ఏమిటి మీరన్నది మళ్లీ చెప్పండి అన్నట్లు అన్నాడు మాయల ఫకీర్.

"అవునండీ జేమ్స్‌వాట్" మాయల ఫకీరు ఖంగు తిన్నాడు. అయినా తొందరగా సర్దుకొని


"జేమ్స్‌వాట్, జేమ్స్‌వాట్, జేమ్స్‌వాట్" అన్నాడు.


"జేమ్స్‌వాట్ వచ్చాడు, అడగండి."

"మీరు ఆవిరి యంత్రం కనిపెట్టడానికి ప్రేరణ మీరు చిన్నప్పుడు వంటింట్లోకి వెళ్లి..."

"ప్రశ్నలు చిన్నవిగా ఉండాలి" అన్నాడు మాయల ఫకీరు.

"సమాధానం చిన్నదే. ప్రశ్న పెద్దదిగా అన్పిస్తుంది" అన్నాడు హరి. అబ్జెక్షన్ ఓవర్‌రూల్డ్






అన్నట్లు చూచి "సరే కానివ్వండి" అన్నాడు మాయల ఫకీరు.

"వంటింట్లోకి వెళ్లి కెటిల్‌లో మరుగుతున్న నీళ్లు ఆవిరిగా మారి మూతను ఎగరగొట్టడం చూడ్డమేనని మాకు తెలుసు. మా దేశంలో తల్లులయితే పిల్లలు వంటింట్లోకి వెళ్లి అల్లరి చేస్తే పిల్లలను చితగ్గొడతారు, వెధవా? నీకిక్కడేం పని అంటూ. కానీ మీ అమ్మగారు మిమ్మల్ని దండించలేదు కాబట్టి మీరు అంత పెద్ద పరిశోధన చెయ్యగలిగారు. ఆమె పేరు చెప్పరూ" హరి అడిగాడు.

అంతవరకూ బిగుసుకుపోయి కూర్చుని ఉన్న మేకపిల్ల బలిపీఠం మీద నుంచి గింజుకుంటున్నట్లు నీళ్లు నములుతూ మాయల ఫకీరు వంక చూశాడు. అంతవరకూ నిజంగానే ఆత్మ ఆవహించినట్లు తను తన వశం తప్పినట్లు చేసిన నటన అంతా గాలికెగిరి పోయింది. మాయల ఫకీరు సైగ నందుకుని మేకపిల్ల "మేరీ" అని రాశాడు. శిలువలా గీతలు గీసి వారి తల్లి అన్నట్లు సైగ చేసి ఉంటాడు మాయల ఫకీరు. ఏదో బుక్ పేరు జేమ్స్‌వాట్ తల్లి పేరు ఎవరికి తెలుసు. మాకూ తెలియదు. మమ్మల్ని బోల్తా కొట్టించగలిగానని సంబర పడుతున్నట్లున్నాడు మాయల ఫకీరు.

ఫారిన్ ఆత్మల్ని కూడా పిలిపించగల అద్భుత శక్తికి బెంబేలెత్తి ప్రేక్షకులు ఈసారి ఫారిన్ పద్ధతిలో చప్పట్లు కొట్టారు. అంతా చాలాసేపు కొడుతూనే ఉన్నారన్నమాట. పైగా రిథమిక్‌గా. ఈసారి శివ వెళ్లాడు.

"కెన్నడీ"

కెన్నడీ, కెన్నడీ, కెన్నడీ" మమ్మల్ని ఎదిరించే ధైర్యం వచ్చినట్లు ఉత్సాహంగా అరిచాడు ఫకీరు.

"కెన్నడీ వచ్చాడు."

"కెన్నడీ గారూ, మీది సహజమరణమా, లేక ఎవరైనా హత్య చేశారా" కావాలనే అందరికీ తెలిసిన ప్రశ్న అడిగాడు శివ.

"హత్య!"

ఈసారి ప్రేక్షకుల్లోంచి అక్కడొకటీ, అక్కడొకటీ వినిపించాయి చప్పట్లు.

జనాలకు జ్ఞానోదయమవుతున్నట్లుంది అనుకున్నాను నేను. ఎనిమిదో ప్రశ్నకు మా ప్రకాశం వెళ్లే లోపు ట్యూబ్‌లైటులేచి వెళ్లాడు. నేను తల కొట్టుకున్నాను. ఏం ప్రశ్న అడుగుతాడో.

కొంతమంది సభలకు వెళ్తారు. కేవలం కాలక్షేపం కోసమే. కానీ ఇలా ప్రేక్షకులకు మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు, నలుగురూ ప్రశ్నలు వేస్తున్నప్పుడు, ఉత్సాహం ఉరకలెత్తి తాము కూడా పది మంది దృష్టిలో పడాలన్న ఉద్దేశంలో విషయం అర్థమైనా, కాకున్నా వేసే ప్రశ్న సందర్భోచితమైనా కాకున్నా స్టేజి ఎక్కి మైకు పట్టుకుని ఏదో అడిగేస్తారు. నలుగురూ నవ్వుకున్నా సరే. ఫొటోలోను ఉంటామని వీడియోలోను పడచ్చనీ, వీలైతే సాయంకాలం వార్తల్లో టీవీలో కన్పించవచ్చనీ వీడియోలో వాళ్లు పడవచ్చు కానీ వార్తలో ముఖ్య ఉపన్యాసకుడ్ని తప్ప మిగిలిన వాళ్లను చూపనప్పుడు చూడాలి ఆ ముఖం.

"హిరణ్యాక్షుడు" ట్యూబ్‌లైటు తనకు వచ్చిన చీటీ తీసి చదివాడు.

"హిరణ్యాక్షుడూ, హిరణ్యాక్షుడూ, హిరణ్యాక్షుడూ"

"భూమి గుండ్రంగా ఉంది కదా. మరి మీరు భూమిని చాపలా చుట్టుకుని తీసుకు వెళ్లారని చెప్తారే పురాణం పంతులు" అన్నాడు తన తెలివికి తను సంతోషిస్తూ.

"అప్పుడు భూమి చాపలాగే ఉంది. నీటి మీద తేలుతూ ఉంది. అందుకే చాప కింద నీరు అన్న సామెత వచ్చింది. తర్వాత గుండ్రంగా మారింది' ' మేకపిల్ల రాసిన దాన్ని సదా జప చదివాడు. మాయల ఫకీరు మేకపిల్ల వంక ఉరిమి చూడ్డం ముందు వరసల్లో ప్రేక్షకులకు కన్పించి ఉండవచ్చు.

ఇంక రెండే ప్రశ్నలున్నాయి. చివరి ప్రశ్న నాకోసం అట్టి పెట్టుకున్నాను. కానీ నా కన్నా ముందుగానే మరెవరైనా వెళ్తే నాకు ఛాన్సు రాదనీ, నీకు చెయ్యదలచుకున్నది చెయ్యలేననీ అనుకుని ఒక్క గంతులో స్టేజి మీదికి వెళ్లాను. ఒకరిద్దరు సీట్లలోంచి లేచి కూడా నన్ను చూచి అయిష్టంగానే సీట్లలో కూలబడ్డారు.

"బాబ్ వాంగ్ స్కీ" నా దగ్గరున్న చీటీ తీసి చదివాను. మాయల ఫకీరుకు అనుమానం వచ్చి ఉంటుంది. ఎందుకంటే ఈ పేరు ఒక దేశానికి చెందింది కాదు.ముందు వేరు వేరు దేశాల భాషల వాళ్ల పేర్లు కలిపి తయారు చేశాను. నిజానికి హరి, శివ చదివిన పేర్లు కూడా మాయల ఫకీరు తయారు చేసుకున్న చీటీల్లో లేదు. అయినా సమర్థించుకోగలిగాడు. ఈసారి చిక్కాడు మహానుభావుడు అనుకున్నాను. కానీ అంత తేలిగ్గా చిక్కలేదు.

"బాబ్ వాంగ్ స్కీ, బాంబ్ వాంగ్ స్కీ, బాబ్ వాంగ్ స్కీ" ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ అన్నాడు.

"బాబ్ వాంగ్ స్కీ వచ్చాడు."

నోటికి వచ్చిన అక్షరాలు కలగలిపి భాషలా ధ్వనించేట్లు చేసి ఏదో అన్నాను. అలా ఏవో అక్షరాలు గబగబా ఉచ్చరించి భాషలా అన్పింప చేసే భాషను జీబ్రిష్ అంటారు.

మేకపిల్ల ఫకీరు కేసి బిత్తరగా చూస్తున్నాడు.

"ఏదో ఒకటి రాసి నన్నీ గండం నుంచి గట్టెక్కించు" అని ప్రాధేయ పడుకున్నట్లు చూస్తున్నాడు ఫకీరు మేకపిల్ల వంక. మేకపిల్ల కళ్లార్పుతూ, కంగారుగా, వణికే చేతుల్తో ఏదో రాశాడు. సదా జప చదివాడు.

"నేను గ్రీకు వాణ్ని కాదు."

ప్రేక్షకులు పెద్ద పెట్టున చప్పట్లు కొట్టారు. నేను గ్రీకు భాష మాట్లాడినందుకో, లేక అది గ్రీకు భాష అని తెలిసి బాబ్ వాంగ్ స్కీ తనకా భాష రాదని తెలుగులో రాసినందుకో

"ఇది గ్రీకు భాష కాదు బాబ్" అన్నాను. బాబ్ అన్న మాట విడిగా విని ప్రాణం లేచి వచ్చిన మేకపిల్ల రాశాడు. ఆస్ట్రేలియన్ భాషలో అడుగు చెప్పాను అని తెలుగులో.

"ఆస్ట్రేలియన్లకు వేరే భాషంటూ ఉండదు. వాళ్లు మాట్లాడేది ఇంగ్లీష్" అన్నాను నేను.

మెడ మీద కత్తి పెట్టి వేటు వెయ్యడానికి సిద్ధంగా ఉన్న కసాయిని చూచినట్లు చూశాడు మేకపిల్ల నా వంక.

"పోనీ ఇంగ్లీషులోనే అడుగు" అన్నాడు మేకపిల్ల రాయడం మర్చిపోయి. అప్పుడు ఫకీరు చూసిన చూపుకు శక్తి ఉంటే మేకపిల్లా, నేనూ కూడా భస్మమయ్యేవాళ్లమే.

"ఆ కుర్రాడికి రాని భాషలో అడిగితే అతడెలా జవాబురాస్తాడు?" కంగారులో మాయల ఫకీరు అసలు విషయం బైట పెట్టేశాడు.

"అతడు మీడియం మాత్రమే. మీడియంకు భాష రావాల్సిన అవసరం లేదు. అతడిని ఆవహించిన ఆత్మే తన భాషలో అతడి చేత రాయిస్తుంది."

"రాయించినా నువ్వు చదవలేవు మిస్టర్" భయపడుతున్నా బింకంగా అన్నాడు ఫకీరు.

"నేను చదవగలను. ఈ ప్రపంచంలోని భాషలన్నీ నాకు వచ్చు. అనుమానమా" అన్నాను నేను. అంతగా ఏదో మాట్లాడు అని నిలదీస్తే జాబ్రిష్ ఉండనే ఉంది.

"ఆత్మకు ఒక భాష ఏమిటి? ఏ భాషలోనైనా మాట్లాడగలవు. తెలుగులోనూ మాట్లాడ్తాయి. ఇంగ్లీషులోనూ మాట్లాడతాయి" ఫకీరుకు ఇంకా నన్ను ఓడించగలనన్న నమ్మకం చావలేదు.

"ఏం ఈ కుర్రాడికి ఆ రెండు భాషలు మాత్రమే వచ్చు కాబట్టా. ఆత్మకు భాషలేదన్నావు. పేరు ఉందా?" ఫకీరుకు మాట రాలేదు. ఇప్పుడిక నేను మాట్లాడవచ్చు అనుకున్నాను. మైకు అందుకున్నాను.

"ఇతడు మిమ్మల్ని మోసం చేస్తున్నాడు. ఇతడి పిలుపు విని ఏ ఆత్మలూ రావు. అంటే ఆ సైన్సు లేదని నేనడం లేదు. ఆ శక్తి ఇతడిలో లేదని అంటున్నాను. లేకుంటే దేవతలూ, మోక్షం పొందిన వాళ్లూ ఆత్మలా. ఇదంతా నాటకం. ఇది నిజమని నమ్మి కొందరు తమ సొంత విషయాలను తమ బంధువుల ఆత్మల ద్వారా తెలుసుకుందామన్న కోరికతో, స్వవిషయాలు పదిమందిలో అడగలేరు కాబట్టి ఇతడిని ఇంటికి ఆహ్వానిస్తారు. ఇంటికి వెళ్లాక ఈ మాయగాడు ఏం చేసినా చెయ్యవచ్చు. డబ్బు, నగలు కొట్టెయ్యవచ్చు. మీ పెద్దల ఆత్మలు వచ్చాయంటూ మీకు పిచ్చి పిచ్చి సమాధానాలు చెప్పి మిమ్మల్ని తప్పుదారి పట్టించవచ్చు. ప్రతి ప్రదర్శన తర్వాత ఇతడికి ఇళ్లకు ఆహ్వానాలు వస్తున్నాయి. అంతెందుకు మీలో కూడా కొందరు ఈ నరికి ఇతడిని ఇంటికి పిలవాలని నిశ్చయించుకుని ఉంటారు.

ప్రేక్షకుల్లో గుసగుసలు మొదలయ్యాయి. ఆ గోల నాకు వినబడలేదుగానీ "అవును సుమా, నిజమే" అనుకుని ఉంటారు అనుకున్నాను.

"అందుచేత..." అంటుండగా అప్పుడు గమనించాను. ప్రేక్షకుల్లో దాదాపు సగం మంది ఎప్పుడో వెళ్లిపోయారు. నా ఉపన్యాసం ప్రారంభం కాగానే వెళ్లారు, అంతకు ముందే వెళ్లారు. మిగిలిన వాళ్లు బయటికి వెళ్ల బోతున్నారు. హాల్లో ఎవరైనా మిగిలున్నారంటే ఇరుకు గేట్లోంచి వెళ్లి దానికి టైం పడుతుంది కాబట్టి విధి లేక నా మాటలు చెవిన వేసుకుంటున్నారు. నేను స్టేజి దిగి బయటికి నడిచాను.

నా మాటలు ఎవరైనా బుర్రకెక్కించుకున్నారా? నేను నా ఉపన్యాసంతో ఒక్కరినైనా మోసపోయేంతా ఆపగలిగానా. ఫకీరు మోసగాడని తెలిసీ నేనెందుకు అతణ్ని చట్టానికి పట్టించ లేకపోయాను? ఒక వేళ పట్టిస్తే అతడికి శిక్ష పడేదా లేక తప్పించుకునే వాడా? నిజంగా నాలో ఉన్న కోరిక ఆ ఫకీరు మోసం బయట పెట్టాలనా, లేక నేను మీలాంటి మామూలు ప్రేక్షకుణ్ని కాదు, మీకన్నా తెలివైన వాడిని అని ప్రేక్షకులను ఎగతాళి చెయ్యాలనే నన్ను నేను గొప్ప చేసుకోవాలనా! ఇవన్నీ జవాబు దొరకని ప్రశ్నలు.

ఇక చస్తే ఫకీరు ప్రదర్శనలివ్వడు. నా ఉపన్యాసానికి ప్రభావితులైన జనం ఫకీరు చేస్తున్న మోసం నుండి తప్పించుకున్నారు. ఆహా! నేను సైతం ఓ గొప్ప పని చేశాను అని ఊహల్లోనే నన్ను నేను సమాధాన పర్చుకుంటూ ఆటో స్టాండు వంక నడిచాను. జేబులో చెయ్యి పెట్టిన నన్ను ఖాళీ జేబు వెక్కిరించింది.

ఎవరు కొట్టేశారు నా పర్సు. శిష్యులా? ట్యూబ్‌లైటు, లేక మరొకరెవరైనా జనంలో వస్తున్నప్పుడు కొట్టేశారా?

"ఆటో" పిలిచాను. ఆటో వచ్చింది. ఎక్కి కూర్చున్నాను.

"బాబ్ వాంగ్ స్కీ" ఎవరో దగ్గరగా అన్నట్లనిపించింది. తిరిగి చూచాను. ఎవరూ లేరు. బాబ్ వాంగ్ స్కీ ఆత్మ కాదు గదా!

## హైకూలు

కెరటం
మరొక కెరటం
క్రమంగా చంద్రోదయం

గాలి
పూలు ఊగాయి
వాటిపై సీతాకోక...

చేయి పట్టుకుంది నిద్రలో
పాప కలలోకి
ఎలా వెళ్లను?

తొలిజాము ప్రయాణం
ప్రవాహంపైన
పొగమంచు

మేఘం తొలగింది
చందమామ
క్షణం ఆగానేమో

తెల్లవారుతోంది
రాలిన పూలపై
మంచు ఆరిన గుర్తులు

ఆమె వచ్చి అంది
చందమామ
మళ్లీ నిశ్శబ్దం

మార్గమధ్యంలో
చీకటి పడింది
మా ఊరిలో లాగానే

మబ్బులు విడినట్లుంది
వెన్నెలలో
నా నీడ పడింది.

- బి.వి.వి. ప్రసాద్